# దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

- ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి
- క్రీడా పోటీలు ప్రారంభం

ములుగురూరల్, డిసెంబర్ 14 : సమాజంలో దివ్యాంగులు సాధారణ పౌరులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తూ స్ఫూర్తి ప్రదాతలుగా నిలవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. దివ్యాంగులకు ఆటల పోటీలను ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ప్రారంభించారు. వారితో కలిసి కలెక్టర్ చెస్ పోటీలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అన్ని అవయవాలు సక్రమంగా పనిచేసే వ్యక్తులు విజయాలను సాధిస్తే, ప్రతి కూలతలను అధిగమిస్తూ అసమాన విజయాలను సాధించే దివ్యాంగులు ఎంతో మందికి ఆదర్శమన్నారు. దివ్యాంగుల తల్లిదండ్రులతో పాటు టీచర్లు, గార్డియన్స్, వారికి తోడుగా నిలిచి సకాలంలో సరైన ప్రోత్సాహాన్నిస్తూ ముందుకు నడిపిస్తున్న వారిని కలెక్టర్ అభినందించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి ప్రేమలత, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, డీఈవో పాణిని, దివ్యాంగుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుడితో చెస్ ఆడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

## గొత్తికోయగుంపును సందర్శించిన కలెక్టర్



గొత్తికోయలతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

వెంకటాపూర్, డిసెంబర్ 14 : మండలంలోని రామకృష్ణాపూర్ సమీప ఊట్ల గొత్తికోయగుంపును గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించారు. ఈ సందర్భంగా ఊరికి దూరంగా ఉండడానికి గల కారణాలు, వారికి కావాల్సిన అవసరాలు, సదుపాయాలు, బాలింతలు, గర్భిణులు, పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం, వైద్యసాయంపై అడిగి తెలుసుకున్నారు. అన్ని సదుపాయాలు ఉన్న సమీప గ్రామంలో నివసించాలని సూచించినా వారు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నట్లు కలెక్టర్‌కు తెలిపారు. వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా ఏర్పాట్లు చేయాలని సంక్షేమాధికారి ప్రేమలతను ఆదేశించారు. నర్సింగ్, డిగ్రీ పూర్తి చేసిన ఇద్దరు విద్యార్థులున్నారని తెలుసుకొని వారి ద్వారా విద్య, వైద్య సదుపాయాలు కల్పించేలా చూడాలని సూచించారు.

## స్పీకర్‌ను కలిసిన నాయకులు

ములుగు రూరల్, డిసెంబర్ 14 : రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను గురువారం హైదరాబాద్‌లో ములుగు జిల్లా కేంద్రానికి చెందిన కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు వంగ రవియాదవ్, జిల్లా కార్యదర్శి కుతుబుద్దీన్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు పగడాల ఓంప్రకాశ్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు గుండెబోయిన రమేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.




స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వంగ రవి తదితరులు

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఏటూరునాగారం, డిసెంబర్ 14 : ఇటీవల మృతి చెందిన మండలంలోని రొయ్యూరుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు జాడి లక్ష్మణ్‌స్వామి కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకులు గురువారం సాయంత్రం రూ. 23 వేల నగదును అందజేశారు. మండల యూత్ అధ్యక్షుడుగా గతంలో పనిచేసిన లక్ష్మణ్‌స్వామి కుటుంబాన్ని ఆదుకోవడంలో భాగంగా ఆర్థిక సాయం అందించినట్లు బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో తుమ్మ మల్లారెడ్డి, కూనూరు మహేశ్, కుమ్మరి చంద్రబాబు, పొదెం కృష్ణ ప్రసాద్, కావిరి అర్జున్, ముంజ రాజేందర్, కొండగొర్ల తిరుపతి, అల్లంల చంటి, కావిరి చిన్ని కృష్ణ, జాడి భోజారావు తదితరులు పాల్గొన్నారు.

**నేతకాని సంఘం ఆధ్వర్యంలో..**

నేతకాని సంఘం ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి నగదు, బియ్యం అందజేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో దుర్గం అశోక్, కావిరి అర్జున్, రాజసమ్మయ్య, అనిల్, దుర్గం గణేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



లక్ష్మణ్‌స్వామి కుటుంబానికి నగదు అందజేస్తున్న నాయకులు

## 17 వరకు పత్తి కొనుగోళ్లు నిలిపివేత

ములుగు రూరల్, డిసెంబర్ 14 : ఈ నెల 17 వరకు పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి సుచిత్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు రైతులు తమ పత్తిని జిన్నింగ్ మిల్లులకు తీసుకురావొద్దని సూచించారు. 18 నుంచి కొనుగోళ్లు తిరిగి ప్రారంభమతాయని ఆమె వివరించారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని సుచిత్ర సూచించారు.



మంత్రి సీతక్కను సన్మానిస్తున్న ఐటీడీఏ అధికారులు

## మంత్రి సీతక్కకు పలువురి అభినందన

గోవిందరావుపేట, డిసెంబర్ 14 : రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా గురువారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు, మహిళలు హైదరాబాద్‌లో సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. మండల పార్టీ అధ్యక్షుడు బాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. అలాగే మేడారం సమ్మక్క-సారలమ్మల చిత్రపటాన్ని పీఏసీఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దాసరి సుధాకర్ సీతక్కకు అందజేశారు. వారివెంట మహిళా మండల అధ్యక్షురాలు నాగమణి, జిల్లా అధికార ప్రతినిధి సోమయ్య, నాయకులు నాగేందర్, శ్రీకాంత్, జయమ్మ తదితరులున్నారు.

**ఐటీడీఏ అధికారులు..**

ఏటూరునాగారం : మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను గురువారం రాత్రి ఐటీడీఏ అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీవో వసంతరావు, ఏవో దామోదర్‌స్వామి, ఎస్‌వో రాజ్‌కుమార్, జియాలజిస్టు కిశోర్, మోతీలాల్ తదితరులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన ప్రాంత అభివృద్ధిపై తీసుకోవాల్సిన అంశాలపై మంత్రి సీతక్క చర్చించినట్లు వారు తెలిపారు.

**మంగపేట నుంచి..**

మంగపేట : మంత్రి సీతక్కను హైదరాబాద్‌లో గురువారం సాయంత్రం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిద్దంశెట్టి శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ది నర్సింహారావు, జిల్లా కార్యదర్శి తూడి భగవాన్‌రెడ్డి తదితరులున్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

మంగపేట, డిసెంబర్ 14 : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్సై రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో గురువారం జ్వాలా యూత్, ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా 25 మంది రక్తదానం చేయగా వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జ్వాలా యూత్, ట్రస్టు అధ్యక్షుడు కోడెల నరేశ్, ఉపాధ్యక్షుడు పుల్లంశెట్టి అజయ్, ప్రధాన కార్యదర్శి మునిగల రాకేశ్, బండపల్లి రవి, కార్యదర్శి ఆత్మకూరి సతీశ్, కల్లెబోయిన సురేశ్, చాదా మల్లయ్య, రవి గుప్తా, ఎండీ గఫార్‌ఖాన్, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, గుగ్గిల్ల సురేశ్, కొండపర్తి నగేశ్, గగ్గురి మహేశ్, సురేశ్, ప్రకాశ్ పాల్గొన్నారు.



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎస్సై



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో అంకిత్

## ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

- విద్యా ప్రమాణాలు పెంపొందించాలి
- ఐటీడీఏ పీవో అంకిత్
- గిరిజన ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ

ఏటూరునాగారం, డిసెంబర్ 14 : విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, పరీక్షలు నిర్వహించాలని ఐటీడీఏ పీవో అంకిత్ ఉపాధ్యాయులను ఆదేశించారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను పీవో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇప్పటి వరకు పూర్తయిన ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షల్లో పొందిన మార్కుల వివరాలను తెలుసుకున్నారు. రోజువారీ కార్యకలాపాలు, టైమ్ టేబుల్ ప్రకారం సిలబస్ పూర్తి చేయడం, సాయంత్రం స్నాక్స్ ఇవ్వడం, యాక్షన్ ప్లాన్ అమలుపై ఆరా తీశారు. ఆర్వో వాటర్ ప్లాంట్ నీళ్లు సరిపోవడం లేదని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీలత నివేదించారు. టెక్నీషియన్‌తో మాట్లాడి మరమ్మతు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారిని పీవో ఆదేశించారు. సోలార్ వాటర్ హీటర్ పనితీరును, భవనం పైకప్పు పనులను పరిశీలించారు. వర్షం పడితే లీకేజీ కాకుండా చూడాలని గిరిజన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హేమలతను ఆదేశించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. జీసీసీ సరఫరా చేస్తున్న నిత్యావసర వస్తువులు, కూరగాయల సేకరణ రిజిస్టర్లను తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్‌ను అప్‌డేట్ చేయాలని హెచ్‌డబ్ల్యూవో శ్రీలతను పీవో ఆదేశించారు.

**కిచెన్ షెడ్లను అందుబాటులోకి తీసుకురావాలి**

తాడ్వాయి : మండల కేంద్రంలో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన కిచెన్ షెడ్లు, డైనింగ్ హాల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఐటీడీఏ పీవో అంకిత్ అధికారులను ఆదేశించారు. గత జాతర అభివృద్ధి పనుల్లో భాగంగా కేటాయించిన నిధులతో మేడారం రోడ్డులో చివరి దశలో ఉన్న కిచెన్ షెడ్లను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా షెడ్డులో ఏర్పాటు చేసిన సౌకర్యాలను అసిస్టెంట్ ఇంజినీర్ దేవిశ్రీని అడిగి తెలుసుకున్నారు. ఎలక్ట్రికల్ పనులు మినహాయించి మిగతావి పూర్తైనట్లు వివరించారు. షెడ్లకు మంజూరైన అదనపు పనులతో పాటు సీసీ రోడ్లు, ప్రహరీ పనులను వెంటనే ప్రారంభించి జాతరలోపు పూర్తిచేయాలన్నారు. జాతర సమయంలో భక్తులకు తెలిసేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని పీవో సూచించారు.



కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ గౌష్ఆలం

## సీసీ కెమెరాలు ప్రారంభించిన ఎస్పీ

వెంకటాపురం (నూగూరు), డిసెంబర్ 14 : మండలంలోని ఆలుబాక, వెంకటాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, సీఆర్పీఎఫ్ క్యాంప్‌లో గెస్ట్‌హౌస్‌ను గురువారం జిల్లా ఎస్పీ గౌష్ఆలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, స్థానిక పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని వెంకటాపురం, వాజేడు మండలాల్లో 70 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, వెంకటాపురం సీఐ బండారు కుమార్, ఎస్సైలు రేఖ అశోక్, కొప్పుల తిరుపతిరావు, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రేపు 'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ

తాడ్వాయి, డిసెంబర్ 14 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యాంజనేయప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1 నవంబర్ 2021 నుంచి 31 మార్చి 2023 వరకు మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులను సోషల్ ఆడిట్ నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే తనిఖీ బృందాలు పనులపై సర్వే చేశాయని, వారు సమర్పించిన నివేదికలతో సామాజిక తనిఖీ నిర్వహిస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు.